క్లుప్తంగా

చంద్ర రాజకుమారి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళా ఉద్యమ నేత అమరజీవి చంద్ర రాజకుమారి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని మహిళా సమైఖ్య జిల్లా నేత, మాజీ కార్పొరేటర్ కొరగంజి దుర్గాంబ అన్నారు. సీపీఐ 53వ డివిజన్ కార్యాలయం ఆధ్వర్యంలో చంద్ర రాజకుమారి ఆరో వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సమైక్య ప్రధాన కార్యదర్శి బంక రూస్సీలక్ష్మి, నాయకులు ఆర్.లక్ష్మి, పిల్లి అప్పలనర్సమ్మ, కొట్టు విజయలక్ష్మి, ఎస్కే శంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో రాకేష్ స్కూలు విద్యార్థుల ప్రతిభ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీసత్యసాయి సేవా సమితి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులను సాధించారని స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు తెలిపారు. కేఎల్ రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. తెలుగు వ్యాస రచనలో బి.సాయి మహాలక్ష్మీ ప్రథమ బహుమతిని, సీహెచ్ భార్గవ్ ద్వితీయ బహుమతిని, కె.సాయి ప్రవళిక తృతీయ బహుమతిని సాధించారు. ఇంగ్లిషు వ్యాస రచనలో పి.గురు నాగ సాయి ప్రథమ బహుమతిని, షేక్ మొమినా ద్వితీయ బహుమతిని, షేక్ ఆఫీఫా ఫిర్‌దోస్ తృతీయ బహుమతిని సాధించారు. ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థిని బి.సాయి మహాలక్ష్మి మొదటి బహుమతిని సాధించింది.

పెంచిన చార్జీలకు నిరసనగా విద్యుత్ బిల్లుల దహనం



వించిపేట(విజయవాడపశ్చిమ): విద్యుత్ ట్రూఅప్, ఇంధన చార్జీల భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో 50వ డివిజన్ గొల్లపాలెం గట్టురోడ్డు, వాటర్ ట్యాంక్ వీధిలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ సత్యబాబు మాట్లాడుతూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు బి.రాజు, నాయకులు కె.లక్ష్మణ, ఎన్.గురవప్ప, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి పరిధిలోని మహాత్మా గాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో మంగళవారం రాత్రి జొన్నవిత్తుల రాము గురుస్వామి నేతృత్వంలో నిర్వహించిన హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. అయ్యప్ప, శివ, గోవింద మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి కీర్తనలు ఆలపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సంయుక్త పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వీఎంసీలోని అన్ని విభాగాల అధికారులు సంయుక్తంగా నిరంతరం నగర పరిశీలన చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ వివిధ శాఖాధిపతులతో కలిసి 23వ డివిజన్ గవర్నర్‌పేటలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో గవర్నర్‌పేటలోని మహంతి మార్కెట్ వద్ద ఉన్న కల్వర్ట్‌లు, మ్యాన్ హోల్‌లు, వివిధ ఆక్రమణలను అధికారులు గమనించి, వెంటనే వాటిని సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దుర్గంధానికి చిరునామా చేపలమార్కెట్

- కొత్తపేట చేపలమార్కెట్‌లో దయనీయంగా పారిశుద్ధ్యం
- ఎటు చూసినా కుళ్లిపోయిన వ్యర్థాలే
- పట్టించుకోని వీఎంసీ అధికారులు
- విచ్చలవిడిగా చెత్తాచెదారాలు

కొత్తపేట చేపల మార్కెట్..ఈ పేరు వింటేనే కుళ్లిన వ్యర్థాల కంపు గుర్తుకొచ్చి వళ్లు జలదరిస్తుంది. రాజధాని నగరమైన విజయవాడలో ఇంతటి దారుణమైన పారిశుద్ధ్య పరిస్థితులున్నా నగర పాలక సంస్థ అధికారులకు చీమకుట్టినట్టయినా ఉండదు. టూటౌన్‌లో పచ్చదనాన్ని చూపించి ఏదో అవార్డులు వచ్చినట్టు గొప్పలు చెప్పుకుంటారు తప్ప ఒన్‌టౌన్‌లో ఎలా ఉన్నా పట్టించుకోరు.


కొత్తపేట చేపలమార్కెట్‌లోని ఒక ప్రాంతం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో కొత్తపేట చేపలమార్కెట్ దుర్గంధానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కేవలం పశ్చిమ నియోజకవర్గంలోనే కాదు మొత్తం విజయవాడ నగరంలోనే పురాతనమైన మార్కెట్‌గా కొత్తపేట చేపలమార్కెట్‌కు పేరు ఉంది. ఈ చేపలమార్కెట్‌లో అడుగు పెట్టగానే వచ్చే దుర్గంధంతో ఆ చుట్టు పక్కల పరిసరాల వైపు రావటానికి సైతం వినియోగదారులు భయపడుతున్నారు. మార్కెట్‌లోకి వస్తే కుళ్లిపోయిన వాసనలతో అడుగు తీసి అడుగు వేసే పరిస్థితులు లేవని వ్యాపారులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. వ్యాపారుల నిర్లక్ష్యంతో పాటుగా నగర పాలక సంస్థ సిబ్బంది దిగజారిన పనితీరుతో పరిస్థితులు మరింత దయనీయంగా మారాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్య సిబ్బంది పట్టించుకోరు

కొత్తపేట చేపల మార్కెట్‌లో స్థానిక వ్యాపారుల నిర్లక్ష్యం కారణంగా అస్తవ్యస్త పరిస్థితులు తలెత్తుతున్నా నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగ సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేసే కూరల విషయంలో పరిశుభ్రత పాటించకపోతే ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కొత్తపేట చేపల మార్కెట్ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జంతు వ్యర్థాలతో దారుణమైన పరిస్థితి

మార్కెట్‌లో ఎండు చేపల దుకాణాలను పక్కన పెడితే పచ్చి చేపలు, కోడి మాంసం విక్రయాలు చేసే వ్యాపారులు అధికంగా ఉంటారు. ఆయా దుకాణాల సమీపంలో కుళ్లిన జంతు వ్యర్థాలతో దారుణమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. మరోవైపు మేక మాసం విక్రయాలు చేసే వారు సైతం తమ వ్యర్థాలను అక్కడే ఉంచటంతో మార్కెట్‌లోకి రావాలంటేనే భయమేస్తోందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపలు, కోడి మాసం, మేక మాంసం విక్రయాలతో వచ్చే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవటం, సరైన నిర్వహణా పద్ధతులు లేకపోవటంతో పారిశుద్ధ్య పరిస్థితులు దారుణంగా దిగజారుతున్నాయి.

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులు వాడినా, ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసినా కఠిన చర్యలు తప్పవని శానిటరీ అధికారులు హెచ్చరించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా 45వ డివిజన్‌లో శానిటరీ సూపర్‌వైజర్ కె.శివరాంప్రసాద్, స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, సచివాలయ సెక్రటరీలు ఉషారాణి, సౌజన్య, శానిటరీ మేస్త్రి కొండా రామిరెడ్డి కలిసి మంగళవారం పలు షాపులను తనిఖీ చేశారు. కబేళా సెంటర్‌లోని రాజస్థాన్ బిర్యానీ పాయింట్ షాపులో 120 మైక్రాన్ల కన్నా మందం తక్కువగల క్యారీ బ్యాగులను వినియోగించడం గుర్తించి సుమారు కేజీ కవర్లు సీజ్ చేయడంతో పాటు రూ.500 జరిమానా విధించారు. డివిజన్‌లో ట్రేడ్ లైసెన్స్ పొందకుండా వ్యాపారం చేస్తుండటంతో వారికి నోటీసులు జారీ చేసినప్పటికీ లెక్క చేయకుండా వ్యాపారం చేస్తున్నందున చట్టంలోని నిబంధనల మేరకు శ్రీవెంకటేశ్వర మెకానికల్ వర్క్స్ (కబేళా సెంటర్), నాగు ఆటో ఎలక్ట్రికల్ వర్క్స్ (రామరాజ్యనగర్), శ్యామ్ దత్త మొబైల్ రిపేర్ షాప్‌లకు సీలు వేశారు.

నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం సమావేశ హాలులో నేషనల్ క్లీన్ ఎయిర్ పాలసీలో భాగంగా కాలుష్య నియంత్రణ కోసం విజయవాడ నగరపాలక సంస్థ వారి ఆధ్వర్యంలో ఎర్త్ గ్లోబల్, ది ఎనర్జీ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టెరి) ట్రాఫిక్, రవాణా, పొల్యూషన్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణకు విజయవాడ నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రమేష్ హాస్పిటల్ నుంచి జమ్మిచెట్టు సెంటర్ వరకు క్లీన్ ఎయిర్ క్వాలిటీని అధ్యయనం చేశారన్నారు. ఎర్త్, టెరి, కాలుష్యాన్ని నియంత్రించేందుకు పరిశోధన ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆ రెండు ప్రాంతాల్లో కాలుష్యం అత్యధికం..

రమేష్ హాస్పిటల్, కాశేశ్వరరావు రోడ్డు ప్రాంతాల్లో నగరంలో అత్యధికంగా కాలుష్యం వెదజల్లుతుందని నిపుణులు చేసిన పరిశోధనలో తేలిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, విజయవాడ నగరపాలక సంస్థ, ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్క్ షాప్‌లో ఎర్త్ గ్లోబల్ ప్రోగ్రామ్ మేనేజర్ వివేక్ వైద్యనాథన్, ఎనర్జీ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టెరి), ఫెలో అండ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ అంజు గోయల్ పర్యవేక్షించారు. చీఫ్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ ఎం.శ్రీరంజని, ఆర్టీవో కె.వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ కె.బసవయ్య, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్టేట్ కోఆర్డినేటర్ ఎం.వినయ్ తేజ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి రావు, ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రతినిధి కె.వెంకటరత్నం, వీఎంసీ ఎన్విరాన్మెంట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు ప్రొటీన్ పౌడర్ పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడిక ఆధ్వర్యంలో మంగళవారం పాత ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో గల బాలింతలకు పోషక విలువలు కలిగిన ప్రొటీన్ పౌడర్ డబ్బాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్, సీపీఆర్ ప్రోగ్రామ్స్ లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైన పేద బాలింత స్త్రీలకు పోషక విలువలు కలిగిన ఆహారం అవసరమని భావించి క్లబ్ వైద్య సేవలలో భాగంగా సుమారు వంద మందికి పోషకాహారాన్ని అందించామని తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ జిల్లా ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ లయన్స్ క్లబ్ మెడిక అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. బాలింతలు తీసుకోవల్సిన జాగ్రత్తలను ప్రొఫెసర్ డాక్టర్ కోలా విజయశేఖర్ వివరించారు. క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్స్, హెల్త్ ప్రోగ్రామ్స్‌తోపాటు సమాజానికి అవసరమైన సేవలను గుర్తించి అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రథమ వైస్ గవర్నర్ ఆంజనేయులు, ఆర్ ఎం శోభ, కార్యదర్శి పువ్వాడ లక్ష్మి శ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ, కేబీవీ సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్త స్వీపింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకురండి


వెహికల్ డిపోను సందర్శించి అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగర పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కొత్త స్వీపింగ్ మిషన్స్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం తన పర్యటనలో భాగంగా హనుమాన్‌పేటలోని వెహికల్ డిపోను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ నుంచి వచ్చిన 8 కొత్త స్వీపింగ్ వాహనాలను, స్వీపింగ్‌కు అనుగుణంగా బ్రష్‌లు అమర్చి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్వయంభు వారి సమన్వయంతో త్వరగా క్లాప్ ఆటోలను అందుబాటులోకి తీసుకువచ్చి పూర్తిస్థాయిలో ఇంటింటి చెత్త సేకరణ జరగాలని అధికారులను ఆదేశించారు. తరచుగా శాఖాధిపతులు వెహికల్ డిపోను సందర్శించి అక్కడ మరమ్మతుల్లో ఉన్న వాహనాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) సత్యకుమారి, ఇన్‌చార్జి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెహికల్ డిపో ఏసుపాదం, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ ఇంద్రజ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):యుక్త వయస్సులో ఆరోగ్యంపై మరింత అవగాహనతో ఉండాలని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఇంద్రజ అన్నారు. ఆయుష్ హాస్పిటల్ సహకారంతో కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థినులు, యుక్త వయసు మహిళలకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఇంద్రజ మాట్లాడుతూ కౌమార దశలో శారీరకంగా వచ్చే అనేక మార్పులను విద్యార్థినులు పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్స్ వంటి హానికర ఆహారపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళా సంబంధమైన వ్యాధుల గురించి విద్యార్థినులు ఎటువంటి అపోహలకు గురికావద్దన్నారు. వైద్యుల సలహా లేకుండా మందులు ఉపయోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే శారీరక ఆరోగ్యం పూర్తిస్థాయిలో సక్రమంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్‌రావు నగర్ సిండికేట్ బ్యాంక్ కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. కొత్తపేట సీఐ చిన్న ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో వ్యభిచార గృహ నిర్వాహకురాలు పల్లంటి సరోజినితో పాటు విటులు ఏసుపోగు జోసఫ్, కానుగంటి తేజలను పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు బాధిత మహిళలను సంరక్షణా గృహానికి తరలించారు.

కృష్ణా వర్సిటీ వాలీబాల్ విజేత ఎస్‌డీఎంఎస్‌ఎంకే జట్టు

విజయవాడస్పోర్ట్స్: కృష్ణా వర్సిటీ అంతర కళాశాలల మహిళల వాలీబాల్ పోటీల్లో శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల(ఎస్‌డీఎంఎస్‌ఎంకే) జట్టు సత్తా చాటింది. సిద్ధార్థ మహిళా కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన పోటీలకు పీబీ సిద్ధార్థ డిగ్రీ కాలేజీ(విజయవాడ), ఏజే అండ్ ఎస్‌జే సిద్ధార్థ కాలేజీ(ఉయ్యూరు), డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్‌జీడీపీ డిగ్రీ కాలేజీ(మైలవరం), మేరీస్ స్టెల్లా కాలేజీ(విజయవాడ), సిద్ధార్థ మహిళా కాలేజీ(విజయవాడ), ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీ(విజయవాడ) జట్లు ప్రాతినిధ్యం వహించాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో ఎస్‌డీఎంఎస్‌ఎం కాలేజీ అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నర్‌గా ఏజీఅండ్ఎస్ సిద్ధార్థ నిలవగా, మూడో స్థానంలో పీబీ సిద్ధార్థ నాల్గవ స్థానంలో మేరీస్ స్టెల్లా కాలేజీ నిలిచి బహుమతులు అందుకున్నారు. విజేతలకు ఎస్‌డీఎంఎస్‌ఎం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.హేమ, సెలక్షన్ కమిటీ సభ్యులు మేజర్ స్వామి, డాక్టర్ సుజాత ట్రోఫీలు అందజేశారు. విజేత జట్లను కాలేజీ కన్వీనర్ లలిత్‌ప్రసాద్ అభినందించారు.

వృద్ధాప్యం..అనుభవాల గ్రంథం

- ఏపీ జెన్‌కో రిటైర్డ్ డైరెక్టర్ ఆంజనేయరావు
- ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం


సత్కారం పొందిన పెన్షనర్లతో అసోసియేషన్ సభ్యులు


క్యారమ్స్ పోటీలో రోలింగ్ షీల్డ్ అందుకుంటున్న శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వృద్ధాప్యాన్ని భారంగా భావించరాదని, అది అనుభవాలతో కూడిన గ్రంథం అని ఏపీ జెన్‌కో రిటైర్డ్ డైరెక్టర్ సాలి ఆంజనేయరావు అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని భవానీపురం హెచ్‌బీ కాలనీలోని ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. తొలుత పెన్షన్ పితామహుడు ధరమ్ స్వరూప్ నకారా (డీఎస్ నకరా) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంజనేయరావు మాట్లాడుతూ ఉద్యోగులు రిటైర్ అయిన తరువాత ఎవరిపైనా ఆధారపడకుండా వారి జీవితం సాఫీగా సాగేందుకు పింఛన్ అవసరమని ఉద్యమించి సాధించిన మహనీయుడు డీఎస్ నకారా చిరస్మరణీయడని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం 75వ వసంతంలోకి అడుగిడిన పెన్షనర్లు వెంపటి సత్యనారాయణ, బుర్రా శ్యామ్‌సుందర్, పమ్మి లక్ష్మీ సూర్య ప్రసాద్, మట్టా సత్యనారాయణ, అన్నం వీరభద్రరావులను ఘనంగా సత్కరించారు. క్యారమ్స్ పోటీల్లో ప్రతాప శ్రీనివాసరావు ప్రథమ స్థానంలో నిలిచి రోలింగ్ షీల్డ్‌ను అందుకున్నారు. పి.గణేష్ (ద్వితీయ), ఎస్ఎన్‌బీ శాస్త్రి (తృతీయ), నీలం సురేంద్ర బాబు (చతుర్ధ) బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, అసోసియేషన్ సెక్రటరీ సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు, ఉపాధ్యక్షులు యేమినేని వెంకటేశ్వర్లు, పమిడిపాటి పట్టాభి రామారావు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన శ్రీ శివ లలిత భరతనాట్య కళాక్షేత్రం శిష్యబృందం మంగళవారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై పిండి మల్లిక పర్యవేక్షణలో ఐశ్వర్య, నిక్షిత, దేదీప్య, సాయిజశ్విత, లాస్య, హేమశ్రీ, రిషిత, పూర్విక, ఛాయాదీప్తి, లోహిత, తన్విలతో పాటు మరి కొంతమంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం మల్లిక, ఆమె శిష్యబృందానికి ఆలయ ఈవో రామరావు అమ్మవారి ప్రసాదాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అంతకుముందు దేవస్థానానికి చెందిన పురాణపండితుడు సీహెచ్‌పీవై వెంకటేశ్వర శర్మ పురాణ ప్రవచనం చేశారు.

ఐజీఎంసీలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు అంచనాలు



విజయవాడస్పోర్ట్స్: ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసే నిమిత్తం క్రీడా శాఖ అధికారులు అంచనాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. శాప్ ఎస్వో కోటేశ్వరరావు, డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, కాకినాడ డీఎస్‌డీవో, అథ్లెటిక్స్ కోచ్ డి.శ్రీనివాస్, అధికారులు శివారెడ్డి, వరలక్ష్మి మంగళవారం స్టేడియాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. 2027లో జరగబోయే జాతీయ క్రీడలకు సంబంధించి 200 మీటర్లు, 400 మీటర్ల ట్రాక్‌లను ఏర్పాటు చేసేందుకు సాధ్యాఅసాధ్యాలను తెలుసుకునేందుకు స్టేడియం చుట్టూ కొలతలు వేశారు. సింథటిక్ ట్రాక్ ఏర్పాటునకు రూ.10 కోట్ల వ్యయం అవుతుందనే ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి ట్రాక్ ఏర్పాటు చేయాలంటే గ్యాలరీలను కొంత మేర తొలగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్టేడియంతో పాటు విద్యాధరపురంలోని మైదానాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో యువత ముందుండాలి


మాట్లాడుతున్న రాజా, వేదికపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

విజయవాడ కల్చరల్: సాహిత్య సాంస్కృతిక రంగాల్లో యువత ముందుండాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పార్టీ, ఇతర అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం యువజనోత్సవాలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళా బృందాలు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ప్రారంభించిన శివప్రసాద్ మాట్లాడుతూ.. యువతను చైతన్య పరచడానికి భారత కమ్యూనిస్ట్‌పార్టీ అనేక ప్రణాళికలను రూపొందించిందన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాంస్కృతిక ం వికాసంతోనే యువత భవిష్యత్ సాధ్యమన్నారు. గురజాడ, శ్రీశ్రీ, పూలే, అంబేద్కర్ సాహిత్యం యువతకు చేరువ చేయాలన్నారు.

పార్టీకి ఘనమైన చరిత్ర

యువజనోత్సవాలనకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పార్టీకి ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రజా పోరాటం ద్వారానే పార్టీ మనుగడ సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీలోనూ వివిధ అనుబంధ సంస్థల కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జంగాల అజయ్‌కుమార్, చంద్రనాయక్, చలసాని అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ వైస్ చైర్మన్ చంద్రిని చందనా ఆకుల అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో కళాశాల ఉమెన్ ఆఫ్ వర్త్ (డబ్ల్యూఓడబ్ల్యూ) క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం కళాశాల ప్రాంగణంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రిని చందనా ఆకుల మాట్లాడుతూ విద్యార్థినులు సమాజంలో ఉన్నతంగా ఎదగటానికి కృషి చేయాలని, ఇతరులకు స్ఫూర్తినిచ్చే దిశగా అడుగులు వేయాలని సూచించారు. నూతన క్లబ్ ద్వారా మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి అన్ని రంగాల్లో ముందడుగు వేసేందుకు కావాల్సిన శక్తియుక్తులను పొందాలన్నారు. తొలుత జరిగిన ర్యాంప్‌వాక్, మిస్ ఉమెన్ లీడర్ తదితర పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణ కుమార్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు, క్లబ్ కోఆర్డినేటర్ నవ్యశ్రీపాల్గొన్నారు.